
# పొగబండి కథలు





ఓలేటి శ్రీనివాసభాను

కొండ కొమ్మన కునుకతీస్తోంది ఆ చిన్న స్టేషన్.
ఇటూ అటూ లోయలు.
భుజాల మీంచీ జారుతున్న జడల్లాగా రెండు వైపులా రైలు పట్టాలు.
అక్కడ ఎక్స్‌ప్రెస్ బళ్లు ఆగవు. ప్యాసింజరు బళ్లూ ఆగవు. రిలీవింగ్ స్టాఫ్ కోసం
ఓ ప్యాసింజర్ బండి-ఆగినట్లే ఆగి-కొంప మునిగినట్లు కూత వేసి పారిపోతుంది.
ఆ కొండ మీదిస్టేషన్‌కి అటు పది, ఇటు పది మొత్తం ఇరవై కిలోమీటర్లు ఘాట్ సెక్షన్.
మధ్యలో మరో స్టేషన్ లేదు. ఘాట్ సెక్షన్‌ని విభజించడానికి ఆ స్టేషన్‌ని నిర్మించారు.
రైల్వే భాషలో చెప్పాలంటే-అది 'కమర్షియల్ స్టేషన్' కాదు. రైళ్ల 'క్రాసింగ్', 'ప్రిసిడెన్స్'
అవసరాల కోసం ఏర్పాటైన స్టేషన్.

# వాటర్ ట్యాంకర్

స్టేషన్ దగ్గరలో ఊళ్లు లేవు. స్టేషన్‌లో నీళ్లు దొరకవు.

పది రోజులకోసారి గూడ్సుబండికి తగినంత నీళ్ల ట్యాంకర్ ఆ స్టేషన్‌కి వస్తుంది. కాసేపు ఆగుతుంది. ఆ సమయంలో రైల్వే సిబ్బంది నీళ్లు పట్టుకొంటారు. నిల్వ చేసుకుంటారు. అలా నెల మొత్తంలో మూడు సార్లు సేకరించిన నీటితో ముప్ఫై రోజులూ గడపాలి.

ఆ నీళ్లతో బియ్యం ఉడకవు. పప్పు బద్దలు బద్దలుగా ఉండిపోతుంది. నీళ్లు తాగితే దాహం తీరదు కదా-గ్లాసెడు బ్లేడు ముక్కల్ని గొంతులో పోసినట్లుంటుంది. సబ్బు నురగ రాదు. బట్టల మురికి పోదు. కొండ దిగువన పది కిలోమీటర్ల దూరంలో వున్న స్టేషన్ నుంచి రిలీవింగ్ స్టాఫ్ కరుణించి క్యాన్ నిండా నీళ్లు తీసుకొస్తే- ఆ స్టేషన్ స్టాఫ్ వాటిని అపురూపంగా, గుళ్లో తీర్థంలాగా కళ్లకి అద్దుకొని, ప్రతీ చుక్కా పొదుపుగా వాడతారు.

అదీ పరిస్థితి!

అలాంటి రోజుల్లో... నిప్పులు చెరిగే వేసవి మధ్యాహ్నం ఆ స్టేషన్‌లో ఓ గూడ్సుబండి ఆగింది.

నిజానికి అక్కడ బండి ఆగాల్సిన అవసరం లేదు.

'త్రూ' సిగ్నల్ వేసి ఉంది.

'లైన్ క్లియర్ టోకెన్'ని 'పౌచ్'లో పెట్టి డ్రైవర్‌కి సరిగానే అందించాడు పాయింట్స్‌మెన్.

అయినా బండి ఎందుకు ఆగిందో అర్థం కాలేదు డ్యూటీలో ఉన్న స్టేషన్ మాస్టర్‌కి. అటూ ఇటూ చూశాడాయన. పొడుగాటి కొండ చిలువలా ఉన్న ఆ గూడ్సుబండి తాలూకు ఇంజన్‌లోంచి పొడుగ్గా... పొగరుగా ఉన్న ఓ కుర్రాఫీసరు దిగాడు. ప్రొబెషన్ ముగించి కొత్తగా పోస్టయినట్లున్నాడు.

ఇంజన్ దిగి చకచకా స్టేషన్ వైపు నడుస్తూ-

''యూకెన్ ప్రొసీడ్'' అంటూ డ్రైవర్‌కి చెయ్యూపుతూ సైగ చేశాడు.

ఇంజన్ కూత పెట్టింది. భళ్లు భళ్లుమంటూ బండంతా కదిలింది. ఆ దృశ్యాన్ని చూసిన స్టేషన్ మాస్టర్ ముందు స్టేషన్‌కి ఔట్ రిపోర్ట్ ఇచ్చాడు. వెనక స్టేషన్ నుంచి వచ్చిన 'లైన్ క్లియర్ టోకెన్'ని 'బ్లాక్ ఇన్‌స్ట్రుమెంట్'లో వేసి లైన్ క్లియర్ చేశాడు. కంట్రోల్ ఫోన్ అందుకొని 'టైమింగ్స్' ఇచ్చాడు.

''పాస్ త్రూ వెళ్లాల్సిన బండి ఎందుకు ఆగింది మాస్టారూ'' అంటూ కంట్రోల్ ఫోన్ లోంచి సెక్షన్ కంట్రోలర్ అడిగాడు.

''ఇంజన్‌లోంచి ఎవరో దిగారు సార్. కొత్తాఫీసర్ కాబోలు. కనుక్కోని చెప్తాను'' అన్నాడు స్టేషన్ మాస్టర్. సాధారణంగా ఆఫీసర్లు ఒంటరిగా రారు. మంది మార్బలంతో వస్తారు. వాళ్లతో పాటు ఆ సెక్షన్‌ని పర్యవేక్షించే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఆఫీసర్‌ని అతి వినయంగా అనుసరిస్తూ, అతిథి మర్యాదలూ గట్రా చూసుకుంటాడు. అలాంటిది ఆ వేసవి మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా, కనీసం అటెండర్‌నైనా తీసుకురాకుండా, అగ్గిరాముడిలాగా దిగబడ్డాడు ఆ కుర్రాఫీసర్...'' సర్‌ప్రైజ్ ఇన్‌స్పెక్షన్ కాబోలు! స్టేషన్ గదిలోకి వస్తూనే....

''ఎవరు మీరు? మీకేం అధికారం ఉందని స్టేషన్‌లోని పరికరాల్ని


Bali

టచ్ చేస్తున్నారు? స్టేషన్ మాస్టర్ ఎక్కడ? అర్జెం టుగా పిలవండి'' అన్నాడు ఆఫీసర్.

''గుడాఫ్టర్‌నూన్ సార్...నేనే స్టేషన్ మాస్టర్‌ని''

''నువ్వా? నువ్వు స్టేషన్ మాస్టర్‌వా?'' ఆఫీసర్ మండిపడ్డాడు. అంతలోనే కళ్లు చిట్లించి, ముక్కు మూసుకున్నాడు.

కారణం-స్టేషన్ మాస్టర్ లుంగీలో ఉన్నాడు. చిల్లుల బనీను వేసుకున్నాడు. ఆ రెండూ మాసి పోయి ఉన్నాయి. అదోరకం వాసన వేస్తున్నాయి.

''యూనిఫాం ఏమైంది?'' ఆఫీసర్ గర్జించాడు.

''క్షమించండి. ఈ లుంగీ, బనీన్ వాసనే మీరు భరించలేకపోతున్నారు. ఇక యూనిఫాం వేసు కుంటే క్లోరోఫాం ఇచ్చినట్లు మూర్ఛ పోవాల్సిందే.''

''ఎగతాళిగా ఉందా? నేను ఈ డివిజన్ సేఫ్టీ ఆఫీసర్‌ని. నీకు బాస్‌ని. వేళాకోళం చేస్తున్నావా? నిన్ను ఇక్కడే సస్పెండ్ చేస్తున్నాను. వెంటనే అసి స్టెంట్ స్టేషన్ మాస్టర్‌ని పిలిపించు. స్టేషన్ ఛార్జి అప్పగించు''

''క్షమించండి సార్. ఇక్కడ ఇద్దరు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌ల పోస్టులైతే ఉన్నాయి గానీ, ఒకటి ఫిలప్ కాలేదు... మరొకటి ఫిలప్ అయినా ప్రస్తుతం తను అందుబాటులో లేడు''

''నీకు బుద్ధుందా? స్టాఫ్ చాలనప్పుడు లీవ్ ఇస్తావా?''

''నేనివ్వలేదు. అతనే తీసుకొన్నాడు..''

'ఏమిటి మళ్లీ వెటకారమా? శాంక్షన్ లేకుండా ఎలా తీసుకున్నాడు?''

''తీసుకోకపోతే కాపురం నిలబడదు మరి. ఇది వెటకారమో, వేళాకోళమో కాదు సార్! 'భారతీయ రైల్వేల' మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. మీరు అనుమతిస్తే అసలు సంగతిలోకి వెళ్తాను. ఇక్కడ ఉన్న ఒక్కగానొక్క అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌కి ఆర్నెల్ల క్రితం పెళ్లయింది. నీళ్లూ, కరెంటూ లేని ఈ స్టేషన్‌లో-పాములూ, తేళ్లూ, కాపురం చేసే రైల్వే క్వార్టర్స్‌లో అతని కొత్త కాపురం మొదలైంది. అయిదు నెలల పాటు ఎలాగో నెట్టుకొచ్చిన కొత్త పెళ్లికూతురు- ఆర్రోజుల క్రితం అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆవిణ్ణి బతిమాలి కాపురం నిలబెట్టు కోవాలని అతనూ వెళ్లిపోయాడు....'' స్టేషన్ మాస్టర్ ఆగి, ఊపిరి తీసుకొన్నాడు.

ఆఫీసర్ వింటున్నాడు.

''కొండల్లో కోనల్లో వనవాసం చేసిన సీతారామ లక్ష్మణులూ, పాండవులూ ఎన్ని కష్టాలు పడ్డారో తెలీదు గానీ, నీళ్ల కోసం కటకటలాడినట్లు నేనె క్కడా చదవలేదు. కానీ ఈ కొండమీద స్టేషన్‌లో డ్యూటీ చేస్తే-వనవాస, అజ్ఞాతవాసాలు ఒకేసారి అనుభవించినట్లు జమలోకి వస్తుంది. ముప్ఫై రోజుల్లో మూడేసార్లు వచ్చే వాటర్ టాంక్-ఈ నెల మొత్తంలో ఒకేసారి వచ్చింది. ''కాలకూట విషం తాగుతావా? ఈ స్టేషన్‌లో నీళ్లు తాగుతావా?' అని నీలకంఠుణ్ణి అడిగితే - మూడు కళ్లూ మూసుకొని విషమే తాగుతానంటాడాయన. మరోసారి నా ఉద్యోగం మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. నా గెడ్డంలాగే యూనిఫాం మూడు జతలూ దారు ణంగా మాసిపోయాయి. డ్రైక్లీనింగ్‌కి వేసినా అవి తేట పడవ్. ఈ వేసవిలో రెండుపూటలా స్నానం చేస్తేనే అంతంత మాత్రం. అలాంటిది నేను స్నానం చేసి ఆరుపూటలైంది. డెబ్భైరెండు గంటలుగా ఏకబి గిన డ్యూటీ చేస్తున్నాను. మా స్టేషన్‌కి వాటర్ ట్యాంకర్‌నీ, నాకు రిలీవర్‌ని పంపమంటూ ఎన్ని కంట్రోల్ మెసేజ్‌లు ఇచ్చానో చూడండి. నా కుటుం బాన్ని మా ఊళ్లో ఉంచి ఇక్కడ ఒంటరిగా ఉంటు న్నాను కాబట్టి ఎలాగో నెట్టుకొస్తున్నాను...'' స్టేషన్ మాస్టర్ మళ్లీ ఆగాడు. ఊపిరి తీసుకొని మళ్లీ మొదలు పెట్టబోయాడు. ఇంతలో మరో గూడ్సుబం డికి పక్క స్టేషన్ నుంచి లైన్ క్లియర్ బీట్స్ వస్తున్నాయి.


ఆఫీసర్‌కి ఆకలిగా ఉంది. ఆయన తనతో పాటు బ్రెడ్, బిస్కెట్స్ తెచ్చుకున్నాడు. అవి తింటే ఆకలి తీరుతుంది. సరే-తాగునీటి మాటేమిటి? ఇక్కడి పరి స్థితి చూడగానే ఆకలీ, దప్పికా, ఆఫీసరనన్న అహంకారం తలో దిక్కూ ఎగిరిపోయాయి. హెడ్ క్వార్టర్స్ దిక్కున వెళ్తున్న గూడ్సుబండిని ఆ స్టేషన్‌లో ఆపించి అందులో చరచరా వెళ్లిపోయాడు ఆఫీసర్.

ఆ సాయంత్రమే- కొండమీది స్టేషన్‌లో డెబ్భై రెండు గంటల పాటు డ్యూటీలో వున్న స్టేషన్ మాస్టర్‌కి రిలీవర్ వచ్చాడు.

ఆ మర్నాడే- 'వాటర్ ట్యాంక్ స్పెషల్' పేరుతో ఆ స్టేషన్‌కి వాటర్ ట్యాంకర్ వచ్చింది.

అందులోని నీళ్లతో అన్నం పువ్వులాగా విచ్చు కొంటోంది. పప్పు లేహ్యంలాగా ఉడుకుతోంది. సబ్బు నురగలు చిమ్ముతోంది. చిటికెడు వాషింగ్ పౌడర్‌తో పది ఉతుకుల ఫలితం కనిపిస్తోంది. ఇప్పుడు వాటర్ ట్యాంకర్ రెగ్యులర్‌గా వస్తోంది. అన్నట్లు- అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ గారి కాపురం జలవసంతం రాకతో గట్టెక్కి కళకళలాడుతోంది.

*



## 'తారే జమీన్ పర్'కి ఆస్కార్ రాదా !?

'తారే జమీన్ పర్' కి ఆస్కార్ ఆస్కారం ఉందా?అంటే... లేదనేది కొందరు సినీ విశ్లేషకుల అభి ప్రాయం. ఎందుకంటే పలు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను నేరుగా తిలకించి ప్రపంచ చిత్రాలను విశ్లేషించిన అనుభవంతో వారు చెబుతున్నారు. కథా కమామీషు...ఆస్కార్ బరిలో 'ఉత్తమ విదేశీ భాషా చిత్రం' విభాగానికి 67దేశాలనుంచి నామినేషన్లు వెళ్లాయి. మనదేశం నుంచి కూడా రెండు చిత్రాలు ఆ జాబితాలో ఉన్నాయి. అయితే వాటిలో అమీర్‌ఖాన్ దర్శకుడిగా రూపొందించిన 'తారే జమీన్ పర్' పైనే మనవాళ్ల దృష్టి. అయితే ఆస్కార్‌కి వచ్చిన చిత్రాలలో ఇంతకంటే మంచి సినిమాల శాతం అధికంగా ఉంద నేది ఓ విశ్లేషణ. రేసులో ఉన్న 'ది క్లాస్' ఇప్పటికే కేన్స్‌లో అత్యుత్తమ చిత్రంగా పురస్కారం అందుకుంది. ఇటాలియన్ మూవీ 'గొమొర్రా' కూడా పెద్ద హిట్ చిత్రం. బ్రెజిలియన్ భారీ హిట్ చిత్రం 'సిటీ ఆఫ్ గాడ్స్'తో ఈ చిత్రాన్ని పోలుస్తున్నారు. జర్మనీ నుంచి 'ది బేడ్డర్ మెయిన్‌హాఫ్ కాంప్లెక్స్' రేసులో ఉంది. ఇటీ వలే ఆ దేశానికే చెందిన 'లైవ్స్ ఆఫ్ అదర్స్' అనే చిత్రానికి అవార్డ్ రావడంతో ఈ జర్మనీ చిత్రానికి భారీగా ప్రమోషన్ రావచ్చని విశ్లేషకుల అంచనా. ఇజ్రాయెల్ చిత్రం 'వాల్ట్జ్ విత్ బషీర్'కు ఎలాంటి రాజకీయ అడ్డం కులు లేకపోతే నామినేషనే కాదు, అవార్డ్ ఎగరేసుకుపోయినా వింతేమీ లేదని వారు పేర్కొంటున్నారు. అలాగే టర్కీ నుంచి వచ్చిన 'త్రీ మంకీస్' దర్శకుడు న్యూరీ బిల్గే సియలాన్ ఈ మధ్యనే ఉత్తమ దర్శకునిగా అవార్డులందుకున్నాడు. అందుచేత ఆ చిత్రాన్ని ఓ లుక్కేయక మానరని విశ్లేషణ. ఇక ఇరాన్ నుంచి మాజిది మాజిది సినిమా 'ది సాంగ్ ఆఫ్ స్పారోస్' కూడా రేసులో పోటీ పడుతోంది. ఖజకిస్తాన్ నుంచి వచ్చిన 'తుల్పాన్' కూడా అనేక చలనచిత్రోత్సవాల్లో పలు అవార్డులు సైతం గెలుచుకుంది. వీటితో పాటు అర్జెంటీనా నుంచి వచ్చిన 'లైన్స్ డెన్', కొరియా నుంచి 'క్రాస్సింగ్', పోలండ్ నుంచి 'ట్రిక్స్' సినిమాలు 'తారే జమీన్ పర్' కంటే అత్యుత్తమంగా ఉంటాయని విశ్లేషణకుల ద్వారా తెలుస్తోంది.

మన దేశం నుంచి 'టింగ్యా' అనే మరో మరాఠీ సినిమా కూడా ఈ రేసులో ఉంది. మన ప్రభుత్వం ఆస్కార్‌కి ఎంపిక చేయకపోయినా ఆ చిత్ర నిర్మాత రవి.రాయ్ ఇండిపెండెంట్‌గా నామినేట్ చేశారు. అయితే ఇది చిన్న సినిమా. చిన్నదే అయినా చిన్నచూపు చూడలేమంటున్నారు. అలాగే 'తారే జమీన్ పర్' చిత్రంలో అమీర్ ఖాన్ స్థానంలో వేరొకరిని ఊహించి చూస్తే ఆ చిత్రానికి అన్ని మార్కులు పడేవా అనేది కూడా ఓ వాదన.